క్లుప్తంగా

బాధితులకు గ్యాస్ స్టౌ, నిత్యావసరాల పంపిణీ



ఘంటసాల: బాధితులకు అండగా నిలుస్తున్న గొరుముచ్చు నాంచారయ్య ట్రస్టు సేవలు అభినందనీయమని పలువురు దైవజనులు అన్నారు. ఘంటసాల ఎస్టీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు అంబేద్కర్‌నగర్‌కు చెందిన నాంచారయ్య ట్రస్టు ఆధ్వర్యాన ట్రస్టు అధినేత అరుణ్ కుమార్, లలిత దంపతులు గ్యాస్ స్టౌలు, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు శనివారం పంపిణీ చేశారు. గుడిసేవ ప్రదీప్ కుమార్, కొడాలి చిన్నా, కావూరి సతీష్ పాల్, కొడాలి లారెన్స్, కావూరి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు సాయం



కోడూరు: హంసలదీవి గ్రామానికి చెందిన తూము వెంకటేశ్వరరావు వైద్యఖర్చుల నిమిత్తం అవనిగడ్డకు చెందిన విక్రృతి ఫౌండేషన్ అధినేత, పారిశ్రామికవేత్త శ్రీనివాసరావు రూ.10వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. వెంకటేశ్వరరావు డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యఖర్చులకు డబ్బులు లేకపోవడంతో విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు రూ.10వేల నగదును అందజేసి దాతృత్వం చాటారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ భారత్



గూడూరు: గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వీర్రాజు ఆధ్వర్యాన సిబ్బంది శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. దీనిలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా మారడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిట్టిబాబు, రామచంద్రరావు, సిబ్బంది ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



కోడూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కోడూరు పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిదో వార్డుకు చెందిన ఓ వ్యక్తి బెల్టు షాపులో విక్రయించేందుకు మద్యాన్ని తరలిస్తున్నాడనే సమాచారంతో ప్రధాన సెంటర్‌లో తనిఖీ చేసినట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు. ఓ వ్యక్తి వద్ద 35 మద్యం సీసాలను గుర్తించి, వాటిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. సదరు వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

రైతులు సమగ్ర ఎరువుల పోషణ పాటించాలి

పెనమలూరు: మండల పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సమగ్ర ఎరువుల పోషణ పాటించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. ఆమె శనివారం రైతులకు ఎరువుల పోషణపై అవగాహన కల్పించారు. ఏవో శైలజ వివరాలు తెలుపుతూ 5,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులు రసాయన ఎరువులు 60 శాతం, సేంద్రియ ఎరువులు 20 శాతం, జీవన ఎరువులు 20 శాతం వేయాలన్నారు. ఇలా వాడటం వలన ఫాస్ఫేట్ సోలిబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) దెబ్బ తినకుండా చూడవచ్చని వివరించారు. సీజన్‌లో రసాయన ఎరువులు మూడు దఫాలుగా వాడాలని సూచించారు. ఎంటీయు 1318 రకం వరికి ఎకరాకి యూరియా 80 కేజీలు, సూపర్ 100 కేజీలు, పొటాష్ 25 కేజీలు చొప్పున వేయాలన్నారు. సూపర్ వేయని పక్షంలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలని సూచించారు. యూరియా ఎక్కువగా వాడితే చీడపీడలు ఆశించి నష్టం కలిగిస్తుందన్నారు. యూరియా వరి నాటిన మొదటి 20 రోజుల్లో ఎకరాకు 30 కేజీలు, దుబ్బు దశలో 30 కేజీలు, పొట్ట దశలో 20 కేజీల చొప్పున వాడాలన్నారు. రైతులు సమగ్ర ఎరువులు వాడి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు.

పేరుకుంటున్న చెత్త నిల్వలు

- పెడనలో సిబ్బంది, వాహనాల కొరత
- ఇళ్లలో చెత్త సేకరణకు అప్పుడప్పుడూ వస్తున్న సిబ్బంది



పెడనలో డంపింగ్ యార్డు వద్ద పేరుకున్న చెత్త నిల్వలు

పెడన: పెడనలో చెత్త నిల్వలు పేరుకుంటున్నాయి. దీనికి కారణం పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాల కొరత అని తెలుస్తోంది. పురపాలక సంఘ పరిధిలో 23 వార్డులు, 31వేలకు పైగా జనాభా ఉన్నారు. ఆయా వార్డుల నుంచి రోజుకు 15 నుంచి 20 మెట్రిక్ టన్నుల వరకు చెత్త వస్తోంది. అధికారిక గణాంకాల్లో రోజుకు 16 మెట్రిక్ టన్నులు. జనాభా పెరుగుదలతో పాటు చెత్త కూడా ఇబ్బడిముబ్బడిగా అధికమవుతోంది. ఈ చెత్తను సేకరించడానికి చాలీచాలని పారిశుద్ధ్య సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

ఒకరోజు ఓ పక్క, మరోరోజు ఇంకో వైపు

ఒకరోజు ఒక పక్క తీస్తే మరోరోజు ఇంకో పక్క. ఇలా నాలుగైదు రోజులకు ఒకసారి పోగైన చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇళ్లకు వచ్చి చెత్త సేకరిస్తున్న పరిస్థితి అయితే దారుణంగా ఉంది. గుర్తుకు వచ్చినప్పుడు..లేదా అధికారి ఆదేశిస్తే ఇంటింటికీ వచ్చి చెత్తను తీసుకెళ్తున్నారు. లేకపోతే ఎవరైనా గట్టిగా అడిగితే సేకరిస్తున్నారు. వాస్తవగా జనాభా ప్రాతిపదికన 70 నుంచి 75 మంది పారిశుద్ధ్య కార్మికులుండాలి. ప్రస్తుతం 51 మంది ఉన్నారని అధికారిక గణాంకాలు.

చక్కబడని పరిస్థితి

గతంలో శానిటరీ మేస్త్రీలుండేవారు. వారిని తీసేసి సచివాలయాలకు చెందిన శానిటరీ కార్యదర్శులను గత ప్రభుత్వం వేసింది. వీరు పట్టణంలో తొమ్మిది మంది ఉన్నారు. వీరంతా ఉన్న సిబ్బందితో పనిచేయించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర సిబ్బందితో ఏం పనులు చేయించగలమనే వాదన కూడా వినిపిస్తోంది.

వెంటాడుతున్న వాహనాల కొరత

వీటికి తోడు వాహనాల కొరత కూడా వెంటాడుతోంది. చెత్తను సేకరించి తరలించడానికి వినియోగిస్తున్న వాహనాలు మూలకు చేరుతున్నాయి. నాలుగు నెలలు కింద పెద్ద కంపాస్టర్ వాహనం మూలకు చేరగా చిన కంపాస్టర్ కూడా అప్పుడప్పుడు రిపేరుకు వస్తుండటంతో కొన్ని రోజులు పాటు పక్కన పెడుతున్నారు. ఈ సమయంలోనూ చెత్త నిల్వలు పట్టణంలో పేరుకుంటున్నాయి. వీటిని బాగు చేయించే ఆర్థిక పరిస్థితులు మున్సిపాలిటీకి లేకపోవడంతో వాటిని బాగు చేయించడం లేదనే వాదన వ్యక్తమవుతుంది.

కొరవడిన నిర్వహణ



మూలకు చేరిన చెత్త తరలింపు వాహనం

మరో పక్క రెండు ఆటోలు సైతం మూలకు చేరి సంవత్సరాలు అవుతోంది. జేసీబీ వాహనం డంపింగ్ యార్డు వద్ద ఉంటుంది. వాస్తవంగా వీటిపై పర్యవేక్షణ లేక నిర్వహణ కొరవడుతోంది. దీంతో వాహనాలు అక్కరకు ఉపయోగపడటం లేదు.

ఎవరైనా సెలవు పెడితే పేరుకోవడమే

చెత్త సేకరణ వాహనాలకు, జేసీబీకి డ్రైవర్లు, క్లీనర్లుగా ఈ పారిశుద్ధ్య కార్మికుల్లో వారే ఉన్నారు. 36 లేదా 37 మంది మాత్రమే పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎవరైనా సెలవు పెడితే ఆ ప్రాంతంలో చెత్త మరింత పేరుకుపోవడమే. సెలవు రోజులు వచ్చినా, ఎవరైనా వీఐపీలు వస్తున్నారని ఇతర ప్రాంతాలకు విధులకు కేటాయించినా కూడా వార్డుల్లోను, ప్రధాన రహదారుల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. వార్డుల్లో అయితే రోజుల తరబడి ఉంటోంది.



పెడన మఠం వీధిలో చెత్త

చర్యలు తీసుకుంటున్నాం



సిబ్బంది, వాహనాల కొరత ఉన్న మాట వాస్తవం. జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను తీసుకోవడానికి కౌన్సిల్ సమావేశంలో అనుమతి తీసుకున్నాం. పలు వాహనాలకు మరమ్మతులు చేయాలి. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, నిపుణులు సలహాలు ఇస్తే అమలుచేస్తాం.

–బి.వెంకటరామయ్య, మున్సిపల్ కమిషనర్, పెడన

డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అర్హులైన గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల కోసం డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను ఏర్పాటు చేశారని దీన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 30 మంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణులైన ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు కోచింగ్‌కు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ లో పొందిన మార్కుల ప్రకారం తయారు చేసిన మెరిట్ జాబితా ఆధారంగా, టెట్ సాధ్యాసాధ్యాల ప్రకారం ఏదైనా స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఉత్తీర్ణత సాధించి ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 95020 82159, 77949 27921 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు అవనిగడ్డకు రక్షణరంగ సాంకేతిక సలహాదారు సతీష్‌రెడ్డి

అవనిగడ్డ: మండలి వెంకట కృష్ణారావు 99వ జయంత్యుత్సవాలు ఆదివారం గాంధీక్షేత్రంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని భారత రక్షణ రంగ సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి అందజేయనున్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు, ఎంపీ బాలశౌరి చేతుల మీదుగా పురస్కారాన్ని సతీష్‌రెడ్డికి అందించనున్నట్టు మండలి ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మోపిదేవి: మోపిదేవి జాతీయ రహదారిపై ఎస్ విహార్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలు కావడంతో చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం మోపిదేవి వైపు నుంచి ద్విచక్రవాహనంపై చల్లపల్లి వెళ్తున్న వృద్ధుడు నరసింహారావును వెనక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. ముందు వాహనంపై ఉన్న నరసింహారావు తలకు గాయం కాగా, వెనక నుంచి ఢీ కొట్టిన సోను కంటి వద్ద గాయాలయ్యాయి. అదేసమయంలో అటుగా వెళుతూ ప్రమాదాన్ని గమనించిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్(రాజా) సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకుని ఈఎంటీ వెంకట నరసయ్య, పైలెట్ చంద్ ప్రథమ చికిత్స చేసి సమీపంలోని చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను 'భవిత'కు తీసుకురండి



ప్రత్యేక అవసరాల విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పీడీ రాములునాయక్

పెడన: ప్రత్యేక అవసరాల పిల్లల్లో రాగలిగిన వారిని భవిత కేంద్రాలకు తల్లిదండ్రులు తీసుకురావాలని సమగ్ర శిక్ష కృష్ణాజిల్లా పీడీ రాములునాయక్ చెప్పారు. ప్రతి శనివారం భవితసెంటర్‌లో పనిచేస్తే సహిత విద్య రిసోర్స్‌పర్సన్లు హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా భవితసెంటర్‌కు హాజరు కాలేని బెడ్ రిడెన్ (మంచం మీద లేదా వీల్ చైర్ లో ఉండే) దివ్యాంగ పిల్లలకు కృత్యాధార బోధనను అందిస్తారు. దీన్ని పీడీ పెడనలోని 15, 16వ వార్డుల్లో పిల్లల బోధనను పరిశీలించారు. పట్టణంలోని ప్రత్యేక అవసరాల పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి పలు విషయాలపై ఆరా తీసి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. ఈ సందర్భంగా పీడీ ఇతర పిల్లలతో పాటు ఉంటే కొంత చైతన్యవంతులు అవుతారని తెలిపారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా ప్రభుత్వం ఫిజియోథెరపీ, ఉపకరణాలు, అలవెన్సులు, మెడికల్ క్యాంపులు, ట్యాబ్‌ల ద్వారా బోధన వంటివి అందిస్తున్నారని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు సెక్టోరల్ అధికారులు రామకృష్ణ, ఎ.సీతామహాలక్ష్మి, ఐఈఆర్పీలు కె.నవీన్, ఎన్.రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని సమగ్ర శిక్ష జిల్లా అధికారి బి.రాములునాయక్ పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గృహసందర్శనలో భాగంగా గూడూరు నగరంపేటలోని దివ్యాంగులు రిజ్వానుల్లా, రియాజుల్లా గృహాన్ని నాయక్ సందర్శించి, భవిత కేంద్రం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఉర్దూ ఏఎంఓ మహాలక్ష్మి, ఎంఈవో-2 పి.సుబ్రహ్మణ్యం, సీఆర్పీ ఏడుకొండలు, హఫీజుల్ రహ్మాన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా ఈ హోమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు తెలిపారు. హోమం నిర్వహించడం వలన ప్రజలు సుభిక్షంగా ఉంటారని, పాడి పంటలతో తులతూగుతారని భక్తులు విశ్వాసం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సెక్రటరీ నారాయణ మురళీకృష్ణ, కోశాధికారి టంగుటూరి వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షులు పి.గోపాలకృష్ణ, సముద్రాల వెంకట జగ్గారావు, టీఎస్‌వీ సాంబశివరావు, చిన్నం గంగాధరరావు పాల్గొన్నారు.

హైబ్రిడ్ మామిడి.. ఏడాదిలో రెండుసార్లు కాపు



పెదకళ్లేపల్లిలో రైతు ఆకుల శంకర్‌కు చెందిన పొలం గట్టుపై పెట్టిన హైబ్రిడ్ మామిడి మొక్కకు కాయలు కాచి అబ్బుర పరిచాయి. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ మొక్క పెట్టిన ఏడాదిలోపే కాయలు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు మూడో సంవత్సరం కాగా ఏడాదికి రెండు సార్లు కాయలు కాస్తుందని చెప్పారు. ఈ కాయలు పెద్ద రసాలు కావడంతో పచ్చళ్లకు బాగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. చుట్టు పక్కల రైతులు ఈ మొక్కను ఆసక్తిగా గమనిస్తున్నారు.

–పెదకళ్లేపల్లి(మోపిదేవి)

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



చేవేంద్రలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ



సీతనపల్లిలో పోషకాహార కిట్లను అందజేస్తున్న సీడీపీవో, పీహెచ్‌సీ వైద్యులు



సదస్సుకు హాజరైన బాలింతలు, గర్భిణులు

పెడన: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పలువురు వక్తలు అన్నారు. మండల పరిధిలోని చేవేంద్ర అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులు, బంధువులు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ. బేబీసరోజ, సీహెచ్ లక్ష్మి, కె.అరుణ, డి.వెంకటేశ్వరమ్మ, బి.బాబి తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: తల్లిపాల వారోత్సవాలను శనివారం మండలంలోని సీతనపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. దీనిలో భాగంగా హాజరైన సీడీపీవో సముద్రవేణి గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు, బాలింతలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, వైద్యపరీక్షలు ఎప్పుడెప్పుడు చేయించాలని అనే అంశాలను కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యులు సాయిసందీప్ వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని సీతాయిలంక అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శేషుకుమారి మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలు ఇస్తే బిడ్డకు రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శిశు మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్.ప్రేమలత, వైద్యసిబ్బంది ఎం. ప్రియాంక, ఆశావర్కర్ విజయలక్ష్మి, లక్ష్మి నరసింహ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: తరకటూరులోని భాగ్యపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు జరిగిన సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమున రేవతి తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో తరకటూరు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

సాగునీటి సర్దుబాటుకు రైతులు సహకరించాలి

ఇరిగేషన్ డీఈ రవికిరణ్

కోడూరు: సాగునీటి సర్దుబాటుతో పాటు దిగువ కాల్వలకు కూడా నీరు చేరేందుకు ఎగువ రైతులు సహకరించాలని ఇరిగేషన్ డీఈ రవికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని లింగారెడ్డిపాలెం ఎనిమిదో నంబర్ పంటకాల్వ పూడికతీత పనులను డీఈ పరిశీలించారు. ఎగువ రైతులు సాగునీటిని ఆయిల్ ఇంజిన్లు, అక్రమ తూముల ద్వారా పొలాల్లోకి మళ్లిస్తున్నారని, దీంతో దిగువకు నీరు చేరడం ఇబ్బందికరంగా మారిందని డీఈ తెలిపారు. సాగునీటిని వృథా చేయకుండా రైతులు సమతౌల్యం పాటించాలన్నారు. ప్రతి ఒక్కరికి సాగునీటిని అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

కోడూరు–అవనిగడ్డ ప్రధాన పంటకాల్వతోపాటు బ్రాంచ్ కాల్వల్లో కూడా పూడికతీత పనులను చేస్తున్నారని తెలిపారు. దీంతో సాగునీరు పారడానికి ఎలాంటి అవరోధాలు లేవని డీఈ చెప్పారు. తీరప్రాంత కాల్వలకు కూడా నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పూడికతీత పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇరిగేషన్ ఏఈ విజయకుమార్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పంటకాల్వ పూడికతీత పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కోడూరు: తీరప్రాంతాల్లో చివరి భూములకు కూడా పుష్కలంగా సాగునీటిని అందించనున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండలంలోని విశ్వనాథపల్లి నుంచి గాబకు వెళ్లే నార్త్ ఛానల్ ఆరో నెంబర్ పంటకాల్వ పూడికతీత పనులను శనివారం మండలి పరిశీలించారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని ప్రధాన పంటకాల్వలతో పాటు బ్రాంచ్ కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు, మట్టి దిబ్బల తొలగింపు పనులు జరుగుతున్నట్లు బుద్ధప్రసాద్ చెప్పారు. సాగునీటి ప్రవాహానికి అవరోధం లేకుండా పనులు వేగవంతంగా సాగుతున్నాయని, ప్రతి ఎకరానికి సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దిగువ రైతులకు నీరు చేరేందుకు ఎగువ రైతులు కూడా సహకరించాలని బుద్ధప్రసాద్ కోరారు. ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జనసేన మండలాధ్యక్షుడు మద్దే గంగయ్య, నేతలు పాల్గొన్నారు.

'పిడుగు'ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలి



రిటైర్డ్ ఎంఈఓ 2 ప్రభాకరబాబు దంపతులను సన్మానిస్తున్న సుబ్బారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు

గోగినేనిపాలెం(ఘంటసాల): వృత్తిపట్ల అంకితభావంతో పని చేసే పిడుగు ప్రభాకరబాబును నేటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని సీఎస్ఈ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సుబ్బారెడ్డి అన్నారు. గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదోన్నతిపై కలిదిండి ఎంఈవో 2 గా వెళ్లి పదవీ విరమణ చేసిన పిడుగు ప్రభాకర బాబుకు ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో అభినందన సభ శనివారం సాయంత్రం నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభాకర బాబు ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ ఏడీ టి.బాలసుబ్రహ్మణ్యం, డైట్ జిల్లా అధికారి లలిత మోహన్ మాట్లాడుతూ ప్రభాకరబాబు సేవలను కొనియాడారు. అనంతరం ప్రభాకర బాబు – నాగ పద్మావతి దంపతులను అతిథులు, ఉపాధ్యాయ బృందం, యూటీఎఫ్ నేతలు తదితరులు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు మనోహర్, గోపాలకృష్ణ, కమాండ్ కంట్రోలర్ ఫాతిమా, డీఈఓ అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బురదకయ్యగా బంటుమిల్లి బస్‌స్టాండ్



పూర్వపు తాలూకా కేంద్రంగా దాదాపు 100 గ్రామాలకు, రెండు జిల్లాలకు కూడలిగా ఉన్న బంటుమిల్లి బస్టాండ్ ప్రాంగణం బురదకయ్యగా నేడు మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కృష్ణా రీజియన్ చైర్మన్‌గా ఉన్న పిన్నింటి మహేష్ ఆధ్వర్యంలో బస్‌స్టాండ్ ఆవరణ మరమ్మతులకు రూ. 50 లక్షలను సంస్థ నిధుల నుంచి కేటాయించారు. ఈ ఏడాది మార్చి 5న భూమి పూజ చేశారు. శంకుస్థాపన చేసి ఐదు నెలలు దాటుతున్నా పనులు మొదలుకాలేదు. ప్రభుత్వం మారిన క్రమంలో మంజూరైన నిధులు విడుదలవుతాయా, బస్టాండు ఆవరణ మరమ్మతులు జరుగుతాయా అనే సంశయం ఎదురవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది. –బంటుమిల్లి

మేకవానిపాలెంలో గడ్డివామి దగ్ధం

కోనేరుసెంటర్: బందరు మండలం మేకవానిపాలెంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని ఓ వ్యక్తి గడ్డివామిని తగలబెట్టాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. వారు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకా మార్కండేయులు వ్యవసాయం చేస్తుంటాడు. పశువుల మేత కోసం ఇటీవల సుమారు రెండు ఎకరాల వరిగడ్డిని కొనుగోలు చేసి ఓ రైతు స్థలంలో నిల్వ ఉంచాడు. శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాలనీలోని వీధిలైట్లు ఆపేసి గడ్డివామికి నిప్పంటించాడు. మంటలు రేగటంతో కాలనీవాసులు మంటలను అదుపు చేయడానికి యత్నించి అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. జరిగిన ప్రమాదంలో గడ్డి మొత్తం దగ్ధమైంది. సుమారు రూ. 20 వేలకు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు చెబుతున్నాడు. ఇదిలా ఉండగా గడిచిన ఎన్నికల్లో మార్కండేయులు వైఎస్సార్ సీపీకి ఏజెంట్‌గా పనిచేశాడు. ఆ సమయంలో కాలనీకి చెందిన జనసేనకు చెందిన ఓ కార్యకర్తతో స్వల్పపాటి వివాదాలు చోటుచేసుకున్నాయి. ఆ సంఘటనను గుర్తు పెట్టుకున్న సదరు జనసేన కార్యకర్త ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు. వీధి లైట్లు ఆఫ్ చేసే సమయంలో ఆ కార్యకర్తను చూసినట్లు కాలనీకి చెందిన కొందరు చెబుతుండటంతో బాధితుడి ఆరోపణ నిజం అనిపిస్తోందని కాలనీ పెద్దలు అభిప్రాయపడుతున్నారు.